జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 25 ॥బుధవారం ॥ 24-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## ఘనంగా 'పద్మ' పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం

### పురస్కారాలు అందుకున్న సినీ, క్రీడా ప్రముఖులు

న్యూఢిల్లీ, జూన్ 23: దేశ రాజధానిలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం ఎంతో వేడుకగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ము ర్ము ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రము ఖులకు ప్రతిష్టాత్మక పద్మ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ వేడుకలో పలువురు దిగ్గజాలు అవా ర్డులను స్వీకరించారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికే యుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యా యమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషన్ పుర స్కారాన్ని అందుకున్నారు. సినీ

తరువాయి 2 వ పేజీలో...



ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై కీలక నిర్ణయాలు

ఎస్‌బిఐ క్యాప్స్‌కు సమగ్ర అధ్యయన బాధ్యతలు

# మెట్రో విస్తరణకు పురోగతి

### రెండు రోజుల చర్చలు విజయవంతమన్న సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్ నగర భవిష్యత్ రవాణా వ్యవస్థకు అత్యంత కీలకంగా భావిస్తున్న మెట్రో రైలు ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణ అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక పురోగతి నమోదైంది. ఈ అంశాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరుసగా రెండు రోజుల పాటు కేంద్ర మంత్రులతో నిర్వహించిన చర్చలు ఫలప్రదమయ్యాయి. మెట్రో విస్తరణకు ఉన్న ఆర్థిక, పరిపాలనా అడ్డంకులను తొలగించే దిశగా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, ఫేజ్-2 విస్తరణ పనులను వేగవంతం చేయడం, అందుకు అవసరమైన నిధుల సమీకరణ, రుణాల సేకరణ వంటి అంశాలపై సమగ్ర చర్చ జరిగింది.

న్యూఢిల్లీ, జూన్ 23

సోమవారం రాత్రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమావేశమయ్యారు. అనంతరం మంగళవారం ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివా సంలో మరో కీలక సమా వేశం (మిగతా 2వ పేజీలో)



మంగళగిరిలో నేటి నుంచి
## ఏపీఎల్-2026 సందడి

మంత్రి లోకేశ్వరవతో 30 వరకు నిర్వహణ

నేడు ప్రారంభోత్సవానికి రానున్న హీరో రామ్ చరణ్

ఫైనల్ మ్యాచ్‌కు హాజరు కానున్న మంత్రి నారా లోకేష్

మంగళగిరి, జూన్ 23: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జీఎంఆర్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2026 టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ చొరవతో మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషన్ క్రికెట్ స్టేడియం వేదికగా జూన్ 24 నుంచి జూన్ 30 వరకు వా రం రోజుల పాటు ఈ ప్రతిష్ఠాత్మక క్రికె ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ తరువాయి 2 వ పేజీలో..



వరి కొనుగోలు లక్ష్యం పెంచాలని
## ఉత్తమ్ విజ్ఞప్తి

### రైతుల ప్రయోజనాల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు

పామాయిల్ రైతులకు మేలు చేసే చర్యలు కోరిన తుమ్మల

వ్యవసాయాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, జూన్ 23

తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పలు కీలక ప్రతిపాదనలు పంపింది. వరి కొనుగోళ్లు, పామాయిల్ సాగు, ఎరువుల సరఫరా తదితర అంశాలపై కేంద్ర మంత్రులకు రాష్ట్ర మంత్రులు లేఖలు రాశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తూ (మిగతా 2వ పేజీలో)



## మెట్రో ఆస్తులపై కన్నేశారు

### రేవంత్-కిషన్ రెడ్డిపై తీవ్ర కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్ మెట్రో రైలు వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. శేరిలింగంపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడిన ఆయన మెట్రో రైలు అంశంపై జరుగుతున్న పరిణామాలను ప్రశ్నించారు.



శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల సమావేశం

హైదరాబాద్, జూన్ 23

హైదరాబాద్ మెట్రో రైలు పేరుతో ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని (మిగతా 2వ పేజీలో)

## ఒలింపిక్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

సీఎం రేవంత్ రెడ్డి

క్రీడాకారులకు అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు

సమాన అవకాశాలతో క్రీడారంగం అభివృద్ధి చెందాలని పిలుపు

2

## వేడెక్కిన తమిళనాడు రాజకీయాలు

అసెంబ్లీలో విజయ్-ఉదయనిధి మధ్య మాటల యుద్ధం

రైతులు, నీట్, హిందీ వివాదాలపై ఘర్షణ

సభలో తీవ్ర దుమారం రేపిన పరస్పర విమర్శలు

చెన్నై, జూన్ 23

తమిళనాడు అసెంబ్లీలో అధికా ర,ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడె క్కింది. ముఖ్యమంత్రి విజయ్, ప్రతి పక్ష నేత (మిగతా 2వ పేజీలో)



# నేటి రాశి ఫలాలు

**మేషం :** ఉత్సాహం, ధైర్యం మీకు బలంగా ఉంటాయి. పనులు సాఫీగా పూర్తి అవుతాయి. ధనలాభం, సంతోషం కలుగుతాయి. కొంత ఒత్తిడి ఉన్నప్పటికీ, మీ ప్రయత్నంతో అన్నీ అనుకూలిస్తాయి. నవగ్రహ ఆరాధన శ్రేయస్కరం.

**వృషభం :** ధనలాభం ఉన్నప్పటికీ మనోబలం కొంత తగ్గే అవకాశం ఉంది. పనుల్లో ఆలస్యం, ఒత్తిడి ఉండవచ్చు. కుటుంబ విషయాల్లో జాగ్రత్త అవసరం. ఓర్పుతో వ్యవహరిస్తే పరిస్థితులు మెరుగుపడతాయి. ఆదిత్య హృదయం పఠించడం మేలు చేస్తుంది.

**మిథునం :** మనస్సు చంచలంగా ఉండే అవకాశం ఉంది. నిర్ణయాల్లో జాగ్రత్త అవసరం. కొంత లాభం ఉన్నప్పటికీ, ఒత్తిడి కూడా ఉంటుంది. ప్రణాళికతో ముందుకు సాగితే మంచి ఫలితాలు పొందవచ్చు. శ్రీలక్ష్మీ ధ్యానం శుభప్రదం.

**కర్కాటకం :** మనోధైర్యం ఉన్నప్పటికీ కొన్ని ఆటంకాలు ఎదురవుతాయి. పనుల్లో జాగ్రత్త అవసరం. కొంత మేర కుటుంబ సభ్యుల సహకారం ఉంటుంది. ఓర్పుతో వ్యవహరిస్తే సమస్యలు తగ్గుతాయి. ఇష్టదేవతా స్తోత్రం పఠించడం శ్రేయస్కరం.

**సింహం :** కొన్ని విషయాల్లో పురోగతి ఉన్నప్పటికీ ఒత్తిడి, ఖర్చులు పెరగవచ్చు. మనస్సు స్థిరంగా ఉంచుకోవాలి. ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చు. ఆదిత్య ఆరాధన మేలు చేస్తుంది.

**కన్య :** మనఃశ్శాంతి, ధైర్యం, సౌఖ్యం కలిసి వస్తాయి. ధనలాభం, గౌరవం పొందుతారు. శత్రువులపై విజయం సాధిస్తారు. మీరు చేసే పనులు విజయవంతం అవుతాయి.శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం మేలు చేస్తుంది..

**తుల :** మనోబలం కొంత తగ్గే అవకాశం ఉంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. పనుల్లో ఒత్తిడి ఉండవచ్చు. శాంతంగా వ్యవహరిస్తే పరిస్థితులు నియంత్రణలోకి వస్తాయి. విష్ణు సహస్రనామ పారాయణం శ్రేయస్కరం.

**వృశ్చికం :** మనఃశ్శాంతి ఉన్నప్పటికీ కొన్ని విషయాల్లో ఆటంకాలు ఉంటాయి. పనుల్లో జాగ్రత్త అవసరం. ధైర్యంగా ముందుకు సాగితే పరిస్థితులు మెరుగుపడతాయి. శ్రీసుబ్రహ్మణ్య స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**ధనుస్సు :** ధైర్యం, సౌఖ్యం, ధనలాభం మీకు తోడుగా ఉంటాయి. పనులు సాఫీగా పూర్తి అవుతాయి. శుభవార్తలు అందుతాయి. మీ కృషికి తగిన ఫలితం లభిస్తుంది. శ్రీరామ నామస్మరణ శుభప్రదం.

**మకరం :** మనఃశ్శాంతి ఉన్నప్పటికీ కొన్ని విషయాల్లో ఒత్తిడి ఉంటుంది. ధనవ్యయం పెరగవచ్చు. ఓర్పుతో వ్యవహరిస్తే సమస్యలు తగ్గుతాయి. ఆధ్యాత్మిక దృష్టి మేలు చేస్తుంది. ఈశ్వర ధ్యానం శ్రేయస్కరం..

**కుంభం :** మనస్సు చంచలంగా ఉండే అవకాశం ఉంది. పనుల్లో ఆటంకాలు ఎదురవుతాయి. జాగ్రత్తగా వ్యవహరిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చు. ఓర్పు అవసరం. నవగ్రహ ఆరాధన శుభప్రదం.

**మీనం :** మనోబలం కొంత తగ్గే అవకాశం ఉంది. కుటుంబ విషయాల్లో జాగ్రత్త అవసరం. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఓర్పుతో వ్యవహరిస్తే పరిస్థితులు మెరుగుపడతాయి. శనిధ్యానం మేలు చేస్తుంది.భప్రదం.



# హైదరాబాద్ మెట్రో విస్తరణ పురోగతి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో మెట్రో ఫేజ్–1 ప్రస్తుత ఆస్తుల విలువ, నిర్వహణ వ్యయం, భవిష్యత్ ఆదాయ వనరులు, స్వాధీన ప్రక్రియకు అవసరమైన ఆర్థిక నమూనా, రుణ సంస్థల ఎంపిక వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే ఫేజ్–2 విస్తరణకు అవసరమైన పెట్టుబడులు, నిర్మాణ వ్యయం, కేంద్ర–రాష్ట్ర భాగస్వామ్యం, రుణ సౌకర్యాలు, ప్రాజెక్టు అమలు కాలపట్టిక వంటి అంశాలను కూడా సమీక్షించారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ మేరకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ మెట్రో ఫేజ్–1 విలువ నిర్ధారణ, స్వాధీన ప్రక్రియ, రుణ సేకరణ విధానం, ఆర్థిక సాధ్యాసాధ్యాలు, ఫేజ్–2 విస్తరణకు అవసరమైన నిధుల సమీకరణ వంటి అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించనుంది. ఎస్‌బీఐ క్యాప్స్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నారు. మెట్రో విస్తరణకు సంబంధించిన ఆర్థిక నమూనా, పెట్టుబడుల నిర్మాణం, రుణాల తిరిగి చెల్లింపు విధానం, ప్రభుత్వ భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా సంస్థ సూచనలు ఇవ్వనుంది. దీంతో ప్రాజెక్టు అమలులో స్పష్టత రావడంతో పాటు నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఏర్పడనుంది. అధ్యయన ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వం తరఫున ఒక సీనియర్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిని సమన్వయ అధికారులుగా నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ఇద్దరు అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ కన్సల్టెంట్ అధ్యయనానికి అవసరమైన సమాచారాన్ని అందించడం, నివేదిక తయారీ ప్రక్రియను వేగవంతం చేయడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ విస్తరణ, పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణ అత్యంత అవసరమని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. ఫేజ్–2 ద్వారా నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో సేవలు విస్తరించనున్నాయి. దీంతో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం తగ్గే అవకాశాలు ఉన్నాయి. మెట్రో విస్తరణ ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమాల్లో ఒకటిగా కొనసాగుతోంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చలు సానుకూలంగా ముగియడంతో ప్రాజెక్టు అమలుకు కొత్త ఊపు లభించిందని అధికారులు భావిస్తున్నారు. ఫేజ్–1 స్వాధీనం, ఫేజ్–2 విస్తరణకు సంబంధించిన ప్రక్రియలు పూర్తయితే హైదరాబాద్ మెట్రో దేశంలోనే అత్యంత విస్తృతమైన పట్టణ రవాణా వ్యవస్థల్లో ఒకటిగా మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఒలింపిక్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

హైదరాబాద్, జూన్ 23



ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా మహోత్సవమైన ఒలింపిక్స్‌కు ప్రతీకగా నిర్వహించే అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్రీడాకారులు, క్రీడాభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన సందేశంలో ఒలింపిక్ దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచవ్యాప్తంగా క్రీడా కారుల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వ భావాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. క్రీడలు దేశాలు, భాషలు, సంస్కృతుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు లింగ, వయసు, సామర్థ్యాల పరంగా ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించే వాతావరణం ఏర్పడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. క్రీడారంగంలో భాగస్వామ్యం అందరికీ అందుబాటులో ఉండేలా సమాజం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ, ఐక్యత, శాంతికి ఒలింపిక్స్ ప్రతీకగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు తమ లక్ష్యాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అలుపెరగని ప్రయత్నం, అంకితభావమే విజయానికి పునాది అని పేర్కొన్న ముఖ్యమంత్రి, క్రీడారంగంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని యువ క్రీడాకారులకు సూచించారు. అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మెట్రో అంశంపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. మెట్రోకు సంబంధించిన వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత లోపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్ అండ్ టి సంస్థకు సంబంధించిన అప్పుల భారం రాష్ట్ర ప్రజలపై మోపే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే గత ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో విస్తరణ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఆమోదం తెలపలేదని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు నిలిచిపోవడంపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి మెట్రో అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి మెట్రో విస్తరణ ఎంతో అవసరమని, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి స్పష్టమైన కార్యాచరణ అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. మెట్రో అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## మంగళగిరిలో నేటి నుంచి ఏపీఎల్-2026 సందడి

మొదటి పేజీ తరువాయి

క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో, జీఎంఆర్ సంస్థ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ఫ్రాంచైజీ జట్లు తలపడనున్నాయి. యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఏపీఎల్‌ను నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జూన్ 24న సాయంత్రం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరుకానుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రామ్ చరణ్ సమక్షంలో ప్రారంభ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటగాళ్ల పరిచయ కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో తొలిసారిగా ఏపీఎల్ టోర్నమెంట్ జరుగుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో స్టేడియం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రేక్షకుల కోసం పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. టోర్నమెంట్‌లో జరిగే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను చాటుకునేందుకు ఇది మంచి వేదికగా నిలవనుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 30న జరిగే ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు అత్యుత్తమ ఆటగాళ్లకు ప్రత్యేక పురస్కారాలు అందజేయనున్నారు. మంగళగిరిని క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఏపీఎల్–2026 టోర్నమెంట్ నిర్వహణకు ప్రాధాన్యత లభించిందని స్థానిక క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి, యువ క్రీడాకారుల ప్రోత్సాహానికి ఈ టోర్నమెంట్ కీలక వేదికగా నిలవనుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## వేడెక్కిన తమిళనాడు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయనిధి స్టాలిన్ మధ్య జరిగిన మాటల యుద్ధం సభలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. విధానపరమైన విమర్శలతో ప్రారంభమైన చర్చ వ్యక్తిగత ఆరోపణల వరకు వెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ హిందీ వివాదం, నీట్ పరీక్ష, రైతుల ఆందోళనలు, కరూర్ తొక్కిసలాట వంటి అంశాలను ప్రస్తావించారు. రైతులను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. అలాగే గత డీఎంకే ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించిందని విమర్శించారు.

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నాయకత్వంపై కూడా విజయ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఒక కుటుంబానికే పరిమితమైన రాజకీయాలు తమ విధానం కాదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సమానంగా సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం మాట్లాడిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను చిన్నచూపు చూడటం సరికాదని, రైతుల నిరసనలకు ప్రతిపక్షాలను బాధ్యులను చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉండటమే ఆందోళనలకు కారణమని పేర్కొన్నారు.

## ఘనంగా 'పద్మ' పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం

మొదటి పేజీ తరువాయి

రంగ దిగ్గజం మమ్ముట్టి, ప్రముఖ నేపథ్య గాయని అల్కా యాగ్నిక్, మరియు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్ పురస్కారాలను స్వీకరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్‌లతో పాటు, నటుడు మాధవన్, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తదితర ప్రముఖులు ఈ పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన మొత్తం 131 మందిని పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

# రైతుల ప్రయోజనాల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు

(మొదటి పేజీ తరువాయి)

రబీ 2025–26 సీజన్‌కు సంబంధించిన వరి కొనుగోలు లక్ష్యాన్ని 35 లక్షల టన్నుల నుంచి 54.50 లక్షల టన్నులకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో పెరిగిన ధాన్య ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా కేంద్ర పూలింగ్‌కు సంబంధించిన కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువులను 60 నుంచి 120 రోజుల వరకు పొడిగించాలని కోరారు. రైతులు, రైస్ మిల్లర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. దేశీయ పామాయిల్ ఉత్పత్తికి ప్రోత్సాహం లభించేలా క్రూడ్ పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని 44 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను దేశంలోనే ప్రధాన పామాయిల్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ రైతులకు కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు హామీ కొనసాగించాలని కేంద్రాన్ని కోరారు. రైతులకు యూరియా ఎరువుల సరఫరా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని కూడా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ రంగ బలోపేతం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

రైతులకు మరింత మేలు జరిగేలా కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.



# శ్వేత సంపాదకీయం

**ఆదివారం 21-6-2026**

# దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం!

దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ డంగయిపోతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్థానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతన్నదని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తులకు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఅ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్‌ట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు పక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ది చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

# దక్షిణాదిలో ఈడీ మెరుపు దాడులు

**తమిళనాడు, కేరళల్లో 28 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు!**

చెన్నై, జూన్ 23: దక్షిణ భారతదేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మంగళవారం ఉదయం ఒకేసారి భారీ సోదాలకు తెరలేపారు. తమిళనాడులో గతంలో జరిగిన ఉపాధ్యాయ నియామక పరీక్షల అవకతవకల కేసులో భాగంగా ఈడీ అధికారులు ఏకకాలంలో 18 ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రాజధాని చెన్నైతో పాటు తిరుచిరాపల్లి, కోయంబత్తూర్, మదురై వంటి ప్రధాన నగరాల్లో పలు ఈడీ ప్రత్యేక బృందాలు ఉదయం నుంచే రంగంలోకి దిగాయి; 2017లో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఆ తర్వాత 2021లో పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ ఆధారంగా ఈ దాడులు జరిగాయి. ఉపాధ్యాయ ఎంపిక ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలకు



పాల్పడి, అర్హత లేని వారి నుంచి కొందరు వ్యక్తులు భారీగా లంచాలు వసూలు చేసి అక్రమంగా డబ్బు సంపాదించినట్లు ఆరోపణలు రావడంతో.. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ, ఆ అక్రమ సొమ్ము ఎక్కడికి తరలిపోయిందనే ఆర్థిక మూలాలను కనిపెట్టేందుకు ఈ సుదీర్ఘ సోదాలు నిర్వహించింది.

మరోవైపు, పొరుగు రాష్ట్రమైన కేరళలో కలకలం రేపుతున్న మానవ అవయవాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై కూడా ఈడీ అధికారులు గట్టి దెబ్బకొట్టారు. కొచ్చి, దాని పరిసర ప్రాంతాల్లోని దాదాపు 10 కేంద్రాల్లో ఈడీ జోనల్ కార్యాలయ అధికారులు తెల్లవారుజాము నుంచే విస్తృతంగా తనిఖీలు చేపట్టారు; ఈ అంతర్జాతీయ కిడ్నీ/అవయవ మార్పిడి రాకెట్‌తో సంబంధం ఉందన్న బలమైన అనుమానంతో కొన్ని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులు, వాటికి అనుబంధంగా ఉన్న లాజిస్టిక్స్ సంస్థల కార్యాలయాలను అధికారులు జల్లెడ పట్టారు. పేద వారిని ప్రలోభపెట్టి అక్రమ పద్ధతుల్లో అవయవమార్పిడులు చేయడం ద్వారా కోట్లాది రూపాయల బ్లాక్ మనీ చేతులు మారినట్లు వచ్చిన పక్కా సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ఒకేసారి జరిగిన ఈడీ మెరుపు దాడులు ఇటు విద్యా, అటు వైద్య రంగాల్లో తీవ్ర సంచలనంగా మారాయి.



# రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ!

**కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసమేనా..?**

న్యూ ఢిల్లీ, జూన్ 23: ఢిలోని రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం రాష్ట్రీయ ప్రాధాన్యత కలిగిన ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా సమావేశమయ్యారు; దేశంలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందనే ఊహాగానాలు జోరుగా సాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరు నేతల సమావేశానికి సంబంధించిన అధికారిక ఫోటోలను రాష్ట్రపతి కార్యాలయం తమ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకుంది. ఈ భేటీకి ముందే కేంద్ర రాజకీయాల్లో కొన్ని వేగవంతమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేరళకు చెందిన బీజేపీ సీనియర్ నేత జార్జ్ కురియన్ తన కేంద్ర సహాయ మంత్రి పదవికి మంగళవారం ఉదయం రాజీనామా చేయగా, దానికి రాష్ట్రపతి తక్షణమే ఆమోదం తెలిపారు; దీనికి తోడు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మే నెలలోనే కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను దిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా పార్టీ జాతీయ నాయకత్వం నియమించింది. ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లోనూ మరికొంతమంది మంత్రులకు పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించే అవకాశం ఉండటంతో, రానున్న రోజుల్లో మరికొన్ని రాజీనామాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేస్తూ ఎన్డీయే కూటమిలోని కొత్త భాగస్వామ్య పక్షాలకు, ఇతర నేతలకు కేబినెట్‌లో స్థానం కల్పించేందుకే ప్రధాని మోదీ ఈ భేటీ ద్వారా తదుపరి పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైనట్లు జాతీయ మీడియా విశ్లేషిస్తోంది.

# టీజీ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**రూ.1.20 కోట్ల ఉచిత జీవిత బీమా**

హైదరాబాద్, జూన్ 23: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ రెడ్డి సర్కార్ శుభవార్త అందించింది. వారి కుటుంబాలకు మెరుగైన ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన భారీ 'ఉచిత జీవిత బీమా పథకాన్ని' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లుండి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లకు సహజ మరణంతో పాటు, ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు కూడా గరిష్టంగా రూ. 1.20 కోట్ల వరకు ఉచిత జీవిత బీమా రక్షణ లభిస్తుంది. ఈ బృహత్తర పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు బ్యాంకులతో అధికారికంగా ఒప్పందాలు కుదుర్చుకుందని అధికారులు వెల్లడించారు.

# రూ.34 వేల కోట్ల పెట్టుబడులు

అమరావతి, జూన్, 23; ఈ ప్రాజెక్టు ల ద్వారా 35 వేల మందికి పైగా ప్రత్య క్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించ నున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తోం ది. ఇటీవల SIPB సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 కంపెనీల పెట్టుబడి ప్రతిపాదనలు ఆమోదం పొందగా, దాదాపు 29,677 ఉద్యోగా లు సృష్టించనున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చింది. అమరావతి అభివృద్ధికి మరోసారి పెద్దపీట వేసిన ప్రభుత్వం ఉండవల్లి ప్రాంతంలో రూ. 426 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఆమో దం తెలిపింది. అలాగే ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ. 130 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది. అమరావతిలో ఫైవ్ స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, వ్యాపార సమావేశాల కేంద్రాల ఏర్పాటు కు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే కేంద్ర ప్రభు త్వం అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయ సముదాయం, ఉద్యోగుల నివాస సముదాయాల నిర్మాణానికి రూ. 2,534 కోట్ల ప్రాజెక్టులను ఆమోదించగా, రాష్ట్ర కేబినెట్ తాజా నిర్ణయాలు రాజధాని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయి.




**విశాఖలో ఐటీ హబ్.. రాయలసీమలో తయారీ రంగం**

పరిశ్రమలు, తయారీ రంగంలో సుమారు రూ. 22 వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐటీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రూ. 5,300 కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయి. విశాఖపట్నంలో ఇన్ఫినిక్స్ ఐటీ క్యాంపస్ ద్వారా 4,000 ఉద్యోగాలు, రాయలసీమలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ యూనిట్ ద్వారా 3,000 ఉద్యోగాలు, శ్యామ్ మెటాలిక్స్ స్టీల్ కాంప్లెక్స్ ద్వారా 3,200 ఉద్యోగాలు, ప్రీమియర్ ఎనర్జీస్ విస్తరణ ప్రాజెక్టుల ద్వారా 3,040 ఉద్యోగాలు లభించనున్నాయి. పతంజలి ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్ ద్వారా 2,000 ఉద్యోగాలు, ఎంసీఎన్ఎక్స్ ఇండియా ఆటోమోటివ్ కెమెరా మాడ్యూల్స్ యూనిట్ ద్వారా 1,633 ఉద్యోగాలు, జెట్‌ఫ్యాబ్ పీసీబీ తయారీ యూనిట్ ద్వారా 1,049 ఉద్యోగాలు, బాల్ బెవరేజెస్, యాక్షన్ టెసా వంటి ప్రాజెక్టుల ద్వారా మరో 1,500 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గత నెలలోనే తిరుపతి జిల్లాలో రూ. 2,508 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్, కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో రూ. 3,149 కోట్లతో గ్రిడాన్ ఎనర్జీ సౌర సెల్ తయారీ యూనిట్, చిత్తూరు జిల్లాలో అపోలో టైర్స్ రూ. 6,100 కోట్ల విస్తరణ ప్రాజెక్టుకు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

**పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, బయోగ్యాస్ రంగాలకు ప్రాధాన్యం**

విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా హోటళ్లు, రిసార్టులు, అడ్వెంచర్ టూరిజం ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు అందించనుంది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గ్రీన్ ఎనర్జీ, ఎథనాల్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్వాంటమ్ వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పెట్టుబడులను మరింత ఆకర్షించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో వెల్లడైంది.

**బీసీ విద్యార్థులకు 10 కొత్త గురుకులాలు**

బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా 10 కొత్త ఎంజేపీ గురుకులాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పల్నాడు జిల్లా మాచర్ల, మార్కాపురం ప్రాంతంలోని గిద్దలూరు, అనంతపురం జిల్లా గుంతకల్లు, అన్నమయ్య జిల్లా రాయచోటి, కర్నూలు జిల్లా పత్తికొండ, మంత్రాలయం, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ, కదిరిలలో ఈ గురుకులాలు ఏర్పాటు కానున్నాయి. ఐదు బాలికల, ఐదు బాలుర గురుకులాల్లో ఒక్కో విద్యాసంస్థకు 37 పోస్టులు మంజూరు చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రవేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**అమరావతి ల్యాండ్ పూలింగ్, పోర్టులకు ఆమోదం**

అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశల అమలు కోసం సీఆర్డీఏ పరిధిలో డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించిన 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల ప్రభావిత ప్రాంతాల పరిధిని 15 కిలోమీటర్లకు హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి, రాజధాని నిర్మాణం, పర్యాటకం, విద్య, ఉద్యోగుల సంక్షేమం వంటి అన్ని రంగాలకు సంబంధించిన నిర్ణయాలకు ఈ కేబినెట్ ద్వారా ఆమోదం లభించింది.



## అణు సాంకేతికతలో నైపుణ్యాభివృద్ధికి ఐఐటీ

# హైదరాబాద్ ముందడుగు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**

దేశంలో వేగంగా విస్తరిస్తున్న అణుశక్తి రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను తీర్చిదిద్దే లక్ష్యంతో భారతీయ సాంకేతిక విద్యాసంస్థ హైదరాబాద్ (ఐఐటీ--హైదరాబాద్) మరియు క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సీఈఈపీఎల్) సంయుక్తంగా 'న్యూక్లియర్ టెక్నాలజీ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్' (ఎన్‌టీఓపీ)ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాయి. మూడు నెలలపాటు నివాస విధానంలో నిర్వహించే ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఆగస్టు 3 నుంచి ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభం కానుంది. భారతదేశం స్వచ్ఛ ఇంధన రంగంలో వేగంగా పురోగమిస్తూ అణుశక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించుకుంటున్న నేపథ్యంలో, అణు సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం పెరుగుతోంది. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఎన్‌టీఓపీ ద్వారా అణుశక్తి ఉత్పత్తి, నిర్వహణ, భద్రత, నియంత్రణ వ్యవస్థలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. ప్రారంభ, మధ్యస్థాయి వృత్తి జీవితంలో ఉన్న ఇంజినీర్లు, ఈపీసీ సంస్థల మేనేజర్లు, తయారీ రంగ నిపుణులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, విద్యుత్ రంగ సిబ్బంది, అలాగే ఇంధన, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల అధికారులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. శిక్షణలో భాగంగా రియాక్టర్ ఫిజిక్స్, రియాక్టర్ ఇంజినీరింగ్, రేడియేషన్ రక్షణ, అణు భద్రత, అణు వ్యర్థాల నిర్వహణ, రియాక్టర్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంట్రోల్ సిస్టమ్స్, థర్మల్ హైడ్రాలిక్స్, నాణ్యత హామీ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, చిన్న మాడ్యులర్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్‌లు) వంటి ఆధునిక అంశాలపై శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులతో పాటు అణుశక్తి విభాగం పరిధిలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ), భాభా అణు పరిశోధనా కేంద్రం (బార్క్), న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్), భవిని (భారతీయ అణు విద్యుత్ సంస్థ) వంటి సంస్థల్లో పనిచేసిన అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, దేశ ఇంధన భద్రత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో అణుశక్తి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పరిశ్రమ అనుభవాన్ని విద్యాసంస్థల నైపుణ్యంతో మేళవించడం ద్వారా వ్యూహాత్మక రంగాలకు అవసరమైన ఉన్నత స్థాయి మానవ వనరులను తయారు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. క్రిమ్సన్ ఎనర్జీ ఎక్స్‌పర్ట్స్ న్యూక్లియర్ విభాగం అధ్యక్షుడు కమోడోర్ ఆర్.డి. మానే మాట్లాడుతూ, భారత అణుశక్తి రంగం విస్తరణకు నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అత్యంత అవసరమని చెప్పారు. ఐఐటీ హైదరాబాద్‌తో భాగస్వామ్యం ద్వారా ప్రపంచ స్థాయి అణు నిపుణులను తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు పడిందన్నారు.



## జిల్లాలో ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు పుస్తకాల

# అమ్మకాల దోపిడీని ఆపాలి

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి భాష

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయడం, పుస్తకాల విక్రయాల పేరుతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని ఆరోపిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు జిల్లా డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా మాట్లాడుతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు, అనుమతులు లేని విద్యాసంస్థలు, భద్రతా ప్రమాణాలు పాటించని స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుస్తకాల విక్రయాలను పూర్తిగా నిషేధించడంతో పాటు, టెట్ అర్హతలేని ఉపాధ్యాయులను తొలగించాలని, ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే టీసీ జారీ విషయంలో విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వంశీ పటేల్, అభినవ్, మహేష్ యాదవ్, శ్రీహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలి:

### ప్రత్యేక అధికారిణి డా. క్రిస్టినా జడ్ చోంగ్తు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**







ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను సమగ్రంగా విశ్లేషించి వాటి పరిష్కారానికి జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని జిల్లాకు ప్రత్యేక అధికారిణిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జడ్ చోంగ్తు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలు, పురోగతిపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా. క్రిస్టినా జడ్ చోంగ్తు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా అమలు చేసి విజయవంతం చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రగతి ప్రణాళిక సభల సందర్భం గా ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులు, సమస్య లు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, శాఖల వారీగా థీమ్ ఆధారంగా అమలు చేసిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రయో జనాలు, సాధించిన లక్ష్యాలు, ప్రజల స్పందన తదితర అంశాలపై శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించ బడ్డాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే విషయాలను సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. పెండింగ్ సమస్య ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమం అమలు సందర్భంగా చేప ట్టిన వినూత్న కార్యక్రమాలు మంచి ఫలితాలు సాధించి ఉంటే వాటిని నిరంతరంగా కొనసాగించే అవకాశాలను పరిశీలిం చాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల చేరువను మెరుగుపరిచి న చర్యలు, ప్రజల ఆదరణ పొందిన కార్యక్రమాలను గుర్తించి భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో పనిచేసిన అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిం చి మరింత సమర్థవంతమైన కార్యాచరణ రూపొందిం చాలని పేర్కొన్నారు.

# పోలీస్ స్టేషన్లలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి:

### డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**





వార్షిక తనిఖీలలో భాగంగా జోగులాంబ జోన్--7 డీఐజీ, చార్మినార్ జోన్--6 ఇన్‌చార్జి ఎల్.ఎస్. చౌహాన్., మంగళవారం సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్, సీసీఎస్, హత్నూర పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ల పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసివేగవంతంగా విచారణ పూర్తి చేయాలని సూచించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్--2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్ వంటి డిజిటల్ వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొం దించుకొని, నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం అందిస్తామనే భరోసా కల్పించాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, కేసులకు సంబంధించిన వివరాలను నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానిత చరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించా రు. బీట్ విధుల్లో భాగంగా అనుమాని తుల వేలిముద్రలను పాపిలాన్ పరికరం ద్వారా తనిఖీ చేసి పాత నేరస్తులను గుర్తించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఉపాధి కోసం వస్తున్నారని, దీంతో ఆర్థిక, ఆస్తి సంబంధిత నేరాల అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. అధిక నేరాలు నమోదవుతున్న ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.



# డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఘన నివాళులు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**



భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాణిక్ రావు మాట్లాడుతూ, భారతదేశ సమైక్యత, జాతీయత, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహానేత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. 1901 జూలై 6న కోల్‌కతాలో జన్మించిన ఆయన విద్యావేత్తగా, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. కేవలం 33 ఏళ్ల వయస్సులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి అతి పిన్న వయస్కుడైన వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో తొలి పరిశ్రమలు, సరఫరాల మంత్రిగా సేవలందించిన ముఖర్జీ భారత పారి శ్రామిక అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. దేశ సమైక్యత కోసం ఆయన నిరంతరం పోరాటం చేశారని, జమ్ము-కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధాను లు, రెండు జెండాలు ఉండకూడదు అనే సిద్ధాంతాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లిన మహానేతగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. 1953 జూన్ 23న జమ్ము-కాశ్మీర్‌లో నిర్బంధంలో ఉన్న సమయంలో ఆయన మరణించారని, దేశం ఆయన త్యాగాన్ని నేటికీ గౌరవంతో స్మరిస్తోందని అన్నారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవితం దేశసేవ, అంకితభావం, జాతీయ సమైక్యత కోసం పోరాడే స్ఫూర్తిని అందిస్తుందని పేర్కొంటూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావు దేశ్‌పాండే, జిల్లా కార్యదర్శులు రాజు, నాగరాజ్, రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, పట్టణ అధ్యక్షుడు దోమల విజయ్ కుమార్, కసిని వాసు, ఎల్లన్న, శ్రీకాంత్, అశోక్, ద్వారకా రవి, జోష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడే జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**

జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్ లో ఈ నెల24న(బుధవారం) ఉదయం 10.00 గంటలకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని డీఆర్డీఓ జ్యోతి ఒక ప్రకటన లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దిశ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు అన్ని వివరాలతో సమావేశానికిసకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

## మరమ్మతుల పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేత

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**

11 కేవీ న్యూ పోస్టాఫీస్ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాలు చేపట్టనున్న నేపథ్యంలో జూన్ 24 (బుధవారం) ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలని సంగారెడ్డి టౌన్-1 ఆపరేషన్ ఏఈ సంతోష్ కోరారు. విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాల్లో సినిమా రోడ్, శివాజీ నగర్, స్టేడియం రోడ్, జలాల్‌బాగ్, సాయికృప నగర్, మీది బజార్, నేతాజీ నగర్, ఎల్‌బీ నగర్, బాబా నగర్, ఎఫ్ఆర్ఎస్ రోడ్, ఫతేఖాన్ దర్గా పరిసరాలు, రాయ్‌మత్‌పుర, భవాని నగర్, భగత్‌సింగ్ నగర్, పోలీస్ స్టేషన్ రోడ్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# ఎస్ఐఆర్ పై బీఎల్ఏలకు అవగాహన శిక్షణ

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23**







తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అందోల్ నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) కోసం అవగాహన, శిక్షణ శిబిరం మంగళ వారం సంగుపేట చౌరస్తాలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజర య్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడానికి బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దేందుకు కృషి చేయాలని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు

**నిజామాబాద్, జూన్ 23**

నిజామాబాద్ జిల్లా నిషేధం, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. విధి నిర్వహణ సమయంలో అవినీతి పద్ధతులు, అక్రమ మార్గాల ద్వారా తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల మేరకు మంగళవారం మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, సన్నిహితులకు సంబంధించిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ స్థాయిలో స్థిర, చర ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. సోదాల సందర్భంగా నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య భవనం, ఎనిమిది ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల



వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు నగదు, బ్యాంకు నిల్వలు, వాహనాలు కూడా ఉన్నట్లు ఏసీబీ వెల్లడించింది. పత్రాల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ. 3 కోట్లుగా అంచనా వేస్తుండగా, మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధి కారులు భావిస్తున్నారు. అదనంగా సుమారు రూ.3.31 లక్షల నగదు, రూ.50 లక్షల బ్యాంకు నిల్వలు, ఒక విలాసవంతమైన కారు, ఒక ద్విచక్ర వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంకు లాకర్లను కూడా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా వాటిని త్వరలో తెరిచిపరిశీలించనున్నారు. సోదాల సమయంలో బయటపడిన ఆస్తులపై పూర్తి స్థాయి ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు. మరిన్ని ఆస్తులు, పెట్టుబడులు, ఆర్థిక లావా దేవీలపై కూడా విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కేసులో మరింత సమాచారం సేకరించేందుకు సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నారు. కేసులో నిందితు డిగా ఉన్న కొమ్మూరి మల్లారెడ్డిని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచి న్యాయస్థాన రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీబీ స్పష్టం చేసింది.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: ఎస్పీ శ్రీనివాసరావు

**మెదక్, జూన్ 23**



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని హెచ్చరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. కష్టపడి చదువుకుని, క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు కూడా యువతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలన కోసం మెదక్ జిల్లా పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు

**నిజామాబాద్, జూన్ 23**



నిజామాబాద్ జిల్లా నిషేధం, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. విధి నిర్వహణ సమయంలో అవినీతి పద్ధతులు, అక్రమ మార్గాల ద్వారా తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల మేరకు మంగళవారం మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, సన్నిహితులకు సంబంధించిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ స్థాయిలో స్థిర, చర ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. సోదాల సందర్భంగా నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య భవనం, ఎనిమిది ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు నగదు, బ్యాంకు నిల్వలు, వాహనాలు కూడా ఉన్నట్లు ఏసీబీ వెల్లడించింది. పత్రాల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.3 కోట్లుగా అంచనా వేస్తుండగా, మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదనంగా సుమారు రూ.3.31 లక్షల నగదు, రూ.50 లక్షల బ్యాంకు నిల్వలు, ఒక విలాసవంతమైన కారు, ఒక ద్విచక్ర వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంకు లాకర్లను కూడా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా వాటిని త్వరలో తెరిచి పరిశీలించనున్నారు. సోదాల సమయంలో బయటపడిన ఆస్తులపై పూర్తి స్థాయి ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు. మరిన్ని ఆస్తులు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలపై కూడా విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కేసులో మరింత సమాచారం సేకరించేందుకు సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నారు.

# మయూరి నగర్‌లో సమస్యల సమీక్ష

**హైదరాబాద్, జూన్ 23**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న 'ఒక వార్డు--ప్రతి రోజు' కార్యక్రమంలో భాగంగా మాధాపూర్ పరిధిలోని మయూరి నగర్‌లో మంగళవారం ప్రత్యేక పర్యటన నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేషన్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ తదితర అధికారులు పాల్గొన్నారు. మయూరి నగర్‌లో స్థానిక నివాసితులు, కాలనీ ప్రతినిధులతో సమా వేశమైన అధికారులు ప్రాంతీయ సమస్యలు, మౌలిక వసతుల అవస రాలపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరు గా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై సూచనలు చేశారు. సర్వే నంబర్ 172 ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు, ఇరుకైన వీధుల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, కొత్త హాస్టల్ భవనాలకు అనుమతుల నియంత్రణ వంటి అంశాలను సమీక్షించారు. అలాగే వీధి కుక్కల సమస్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల నివారణ కోసం ప్రత్యేకంగా మందుల పిచికారీ చేపట్టాలని సూచించారు. సీఆర్‌పీఎఫ్ పరిసర ప్రాంతాల్లో చేరుకోవడా నికి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ నగర్‌లో కేబుళ్లు, పొడి చెత్త దహనం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మయూరి నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో పేరుకుపోయిన సీసీ, బీటీ వ్యర్థాలను తొలగించా లని సంబంధిత అధికా రులకు సూచించారు. మియాపూర్--



గండిమైసమ్మ రహదారి, డ్రైనేజీ పనులను సంబంధిత సంస్థల నుంచి స్వాధీనం చేసుకుని పూర్తి చేసేందుకు అవస రమైన నిధుల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత శాఖలను ఆదేశించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**గద్వాల, జూన్ 23**

జిల్లాలో ఓటరు జాబితాను తప్పులు లేకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ను ప్రణాళికాబద్ధంగా, విజయవంతంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హ ఓటరును గుర్తించి జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సర్వే నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, ఇతర అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు సంబంధించిన విధివిధానాలను వివరించి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అన్ని వివరాలను ఓటర్లు సక్రమంగా నమోదు చేసేలా అవగాహన కల్పించాలని, అవసరమైతే బూత్ లెవల్ ఏజెంట్ల సహకారం తీసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజూ ఎన్ని ఇళ్లను సందర్శించారు, ఎన్ని ఫారాలు పంపిణీ చేశారు, ఎన్ని ఫారాలు తిరిగి స్వీకరించారనే సమాచారాన్ని సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఎన్నికల సంఘం రోజువారీగా పర్యవేక్షిస్తుందని, డేటా నమోదు విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. బీఎల్‌వోలకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసీల్దార్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఓటర్లు కూడా నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఎలాంటి పొరపాట్లు లేని సమగ్ర ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, మాస్టర్ ట్రైనర్ తిమ్మారెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, సూపర్వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.





# వాయుపురి కాలనీలో వనమహోత్సవం

**మల్కాజిగిరి, జూన్ 23**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాయుపురి కాలనీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలనీలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కృషి చేయాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులకు ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంట్లో కనీసం ఒక మొక్కను పెంచాలని, పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. వనమహోత్సవ కార్యక్రమంతో పాటు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2026పై కూడా అవగాహన కల్పించారు.



# నల్లచెరువు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

**హైదరాబాద్, జూన్ 23**

ఉప్పల్ నియోజకవర్గంలో చేపట్టిన నల్లచెరువు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నల్ల చెరువు అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటుతో పాటు ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. చెరువుల పరిరక్షణతో భూగర్భ జలాల పెరుగుదలకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు ఆదేశించారు. చెరువు పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదానికి అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు.



# బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామికి ఘన నివాళులు

**హైదరాబాద్, జూన్ 23**

రామంతాపూర్‌లో అయ్యప్ప గురుస్వామి బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేశ్ శర్మ తండ్రి, ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి పరమపదించిన సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల భక్తులు, ఆధ్యాత్మిక వర్గాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి పార్థివదేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి ఘన నివాళులర్పిం చారు. గురుస్వామి ఆధ్యాత్మిక సేవలను ఈ సందర్భంగా స్మరించుకు న్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీనివాస్ గౌడ్ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని, భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదిం చాలని ఆకాంక్షించారు. అయ్యప్ప భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందిం చడంలో బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి విశేష కృషి చేశారని పలువురు పేర్కొన్నారు.



దళితుల రక్షణలో ప్రభుత్వం విఫలమైంది:

# తలారి రంగయ్య

**కళ్యాణదుర్గం, జూన్ 23**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ పార్లమెంట్ సభ్యుడు, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆరోపించారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంబుగుంపుల తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ సెల్ నాయకుల సమావేశంలో తలారి రంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ దళితుల పక్షాన నిలబడుతుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండి పార్టీ ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి మాట్లాడుతూ 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి తలారి రంగయ్యే పార్టీ అభ్యర్థిగా ఉంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో దళితులకు లభించిన గౌరవం ప్రస్తుతం కనిపించడం లేదని విమర్శించారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ నాయకులు, మండల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.



# విశాఖ తీర కారిడార్‌కు వేగం

**విశాఖపట్నం, జూన్ 23**

విశాఖపట్నం తీర ప్రాంత అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న కోస్టల్ కారిడార్ ప్రణాళికలు వేగం పుంజుకుంటున్నాయి. మధురవాడ నుంచి భీమునిపట్నం మధ్య ఉన్న సుమారు 499 హెక్టార్ల తీర ప్రాంత భూమిని సీఆర్జెడ్--xxx బీ నుంచి సీఆర్జెడ్--xx కేటగిరీగా పున ర్వర్గీకరించేందుకు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ఈ పునర్వర్గీకరణకు ఆమోదం లభిస్తే విశాఖపట్నం నగరాన్ని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే ప్రతిష్ఠాత్మక తీర కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన పలు కీలక ప్రాజెక్టులకు కూడా ఈ నిర్ణయం ఉపయోగపడే అవకాశముంది. ముఖ్యంగా పర్యాటక రంగ విస్తరణ, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, కొత్త పెట్టుబడుల ఆకర్షణకు ఇది ఊతమివ్వనుందని నిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా భవిష్యత్‌లో ప్రతిపాదిత మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణకు కూడా ఈ పునర్వర్గీకరణ సహకరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. నగర విస్తరణతో పాటు రవాణా సదుపాయాలను మరింత బలోపేతం చేయడానికి ఈ ప్రణాళికలు ఉపయోగపడనున్నాయి. భోగాపురం విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యే సమయానికి తీర కారిడార్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు మెరుగైన అనుసంధానం కల్పించడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వనుంది. రియల్ ఎస్టేట్, పర్యాటక, సేవా రంగాల్లో కూడా కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.

# గాలివానతో దెబ్బతిన్న విద్యుత్ లైన్ల పునరుద్ధరణ

**ఆదిలాబాద్, జూన్ 23**



ఖానాపూర్ పరిధిలో ఇటీవల వీచిన ఈదురుగాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా 33 కేవీ బీర్నంది విద్యుత్ లైన్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో లైన్ మౌలిక సదుపాయాలు ప్రభావితమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా వెంటనే స్పందించిన ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టారు. పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నాలుగు 9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలను విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సాంకేతిక సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తూ విద్యుత్ వ్యవస్థను సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది సేవాభావంతో పనిచేస్తున్నారని అధికారులు అభినందించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

# కరీంనగర్‌లో పోలీసుల ముమ్మర తనిఖీలు

**కరీంనగర్, జూన్ 23**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదక ద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా కరీంనగర్ పోలీసులు భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేశారు. ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ బస్ స్టాండ్, ఆర్టీసీ కార్గో పార్సిల్ కేంద్రంలో విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టారు. వాహనాల తనిఖీలతో పాటు అనుమానాస్పద వస్తువులు, మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసు శునకం 'లియో' సహాయంతో పార్సి ళ్లు, లగేజీలు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



మాద క ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడం, నేర కార్యక లాపాలను ముందంగానే గుర్తించడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలనైనా ఉపేక్షించ బోమని పోలీసులు స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాలు, రవాణా కేంద్రాలు, పార్సిల్ సేవల వద్ద నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతు న్నారని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకా రంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగల మని పోలీసులుపేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలా పాలపై అప్రమ త్తంగా ఉండి సమాచారం అందించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కరీంనగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## ద్వారకా తిరుమలలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

**ద్వారకా తిరుమల, జూన్ 23**

ద్వారకా తిరుమలలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ, కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ద్వారకా తిరుమల ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. విద్యుత్ మౌలిక వసతుల బలోపేతంతో వ్యవసాయ రంగానికి గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడం ద్వారా సాగు కార్యకలాపాలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. అలాగే వాణిజ్య, వ్యాపార రంగాల అభివృద్ధికి కూడా ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో చిన్న, మధ్య తరహా వ్యాపార కార్యకలాపాలకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నామని, విద్యుత్ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పురందేశ్వరి అన్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

**విశాఖపట్నం, జూన్ 23**

జనసంఘ్ వ్యవస్థాపకుడు, మహనీయ దేశభక్తుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా విశాఖపట్నంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశ సమగ్రత, జాతీయ ఏకత్వం, ఒకే రాజ్యాంగం -- ఒకే జెండా అనే సిద్ధాంతాల కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను స్మరించుకున్నారు. పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. జాతీయ భావజాలాన్ని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ఆయన జీవితాంతం పోరాటం చేశారని, జాతీయ సమగ్రత కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు.



# సిట్ అదుపులో సీఐ నాగరాజు

**విజయవాడ, జూన్ 23**

విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సీఐ నాగరాజును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో ఉన్న నాగరాజు నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు విచారణ నిమిత్తం ఆయనను కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం మరింత విచారణ కోసం తమ కార్యాలయానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు మద్దతుదారులు, అనుచరులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. సిట్ అధికారులు నాగరాజును తరలించే సమయంలో కొందరు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అదనపు పోలీసు బలగా లను కూడా మోహరించారు. ప్రస్తుతం నాగ రాజు మద్దతుదారులు విజ యవాడ కమాండ్ అండ్ కంట్రో ల్ సెంటర్ ఎదుట నిరసన వ్యక్తం చే స్తూ నినాదాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గాదె సాయి కృష్ణను మే 9న పోలీసు బృందం అదుపులోకి తీసుకెళ్లిన తర్వాత అతను కనిపించకుండా పోయాడని కుటుంబ సభ్యు లు ఆరోపిస్తున్నారు.




## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

**వరంగల్, జూన్ 23**

మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేయవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. మైనర్ల డ్రైవింగ్ కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమానులు, తల్లిదండ్రులే బాధ్యులవుతారని, చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ కొందరు వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాన్ని ఈ సందర్భంగా సీపీ ప్రస్తావించారు. మైనర్ బాలుడు అతివేగంగా వాహనం నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు వృద్ధులతో పాటు ఒక మైనర్ బాలుడు మృతి చెందగా, మరో బాలుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఎలాంటి తప్పు చేయని ఇద్దరు వృద్ధులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు సమాజానికి హెచ్చరికగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ దీనిపై ఆలోచించాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించగలమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. మైనర్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదం జరిగితే వాహన యజమాని లేదా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.



## జగన్ విభజన రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నిమ్మల ఆరోపణ

**అమరావతి, జూన్ 23**

ఎన్నికల ఓటమి తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రాంతాలు, కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానా యుడు ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీలోని కొంద రు కాపు నాయకులను రెచ్చగొట్టి రాజకీయంగా ఇబ్బందుల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని మంత్రి ఆరోపించారు. కొందరు నాయకులతో వివాదాస్పద చర్యలు చేయించి, అనంతరం వారిని రాజకీయంగా ఒంటరిని చేసే వ్యూహాన్ని వైసీపీ నాయకత్వం అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ప్రజలను తప్పుదో వ పట్టించే ప్రయత్నాలు సాగుతున్నాయని పేర్కొన్న మంత్రి, టీడీపీ మాత్రం సమాజంలోని అన్ని వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ బలమైన నాయకులను తయారు చేస్తోంద న్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారా లను ప్రస్తావిస్తూ, గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ఇచ్చిన తీర్పు వెనుక అనేక కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు విశ్వసించలేదని అన్నారు. టీటీడీ పాలక మండలి నియామకాల అంశంపై కూడా మంత్రి స్పందించారు. గతంలో టీడీపీ వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులకు అవకాశాలు కల్పించిందని, వైసీపీ మాత్రం పరిమిత వర్గాలకే ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, కాపు వర్గానికి ప్రత్యేక అవకాశాలు కల్పించేందుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

# తల్లి నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చింది: క్రాంతి గౌడ్ భావోద్వేగం





**న్యూఢిల్లీ, 23 జూన్ 2026**

టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ క్రాంతి గౌడ్ తన క్రికెట్ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలు, కుటుంబం చేసిన త్యాగాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తన క్రికెట్ కిట్ కోసం తన తల్లి నగలు అమ్మి సహాయం చేసిందని ఆమె వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన తాను అంతర్జాతీయ స్థాయికి చేరడం సులభం కాలేదని క్రాంతి తెలిపారు. చిన్న వయసులోనే గ్రామంలో ఆడపిల్లలు బయటకు రావడానికే విమర్శలు ఎదుర్కొనేవారని, అయినా కష్టపడి సాధన కొనసాగించినట్లు చెప్పారు. కుటుంబ మద్దతు తన కెరీర్‌కు పెద్ద బలమని ఆమె స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తన కలను నమ్మి ఎప్పుడూ ప్రోత్సహించారని, ఆర్థిక ఇబ్బందుల సమయంలో తల్లి తన నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చిన ఘటనను ఆమె భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. ఇంగ్లండ్ పర్యటనలో ఒక మ్యాచ్‌లో 52 పరుగులకు 6 వికెట్లు తీసి ఆమె అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ప్రపంచకప్‌లో రాణించడంతో తన స్వగ్రామంలో క్రికెట్ అకాడమీ ఏర్పడిందని క్రాంతి ఆనందం వ్యక్తం చేశారు. తనను చూసి గ్రామంలోని మరెంతో మంది అమ్మాయిలు క్రికెట్‌లోకి వస్తుండటం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

# ఐర్లాండ్ సిరీస్‌కు నితీశ కుమార్ రెడ్డి దూరం

**ముంబై, 23 జూన్ 2026**

భారత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా అతను జట్టుకు అందుబాటులో లేకుండా పోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఫీల్డ్ చేస్తూ గాయపడిన నితీశ్, అనంతరం జరిగిన పరీక్షల్లో ఎడమ కాలి కండరంలో వాపు ఉన్నట్లు ఎంఆర్ఐ స్కానింగ్‌లో తేలింది. ప్రస్తుతం అతను బెంగళూరులోని సీఓఈలో వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నాడు. పూర్తిగా కోలుకోవడానికి కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని వైద్యులు అంచనా వేస్తున్నారు. అయితే గాయం తీవ్రతను బట్టి ఈ గడువు మరింత పెరిగే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. ఇక నితీశ్ స్థానంలో యువ ఆటగాడు సూర్యాన్ష్ షెడ్జ్‌ను ఎంపిక చేసినట్లు జట్టు మేనేజ్‌మెంట్ తెలిపింది. ఇటీవల ఇండియా-ఏ జట్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సూర్యాన్ష్, శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేశాడు. అలాగే ముంబై జట్టు తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 251 స్ట్రైక్ రేటుతో 131 పరుగులు చేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.





# శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో యువ భారత జట్టు ఇంగ్లండ్ టూర్‌కు సిద్ధం

**న్యూఢిల్లీ, 23 జూన్ 2026**

టీ20 ప్రపంచకప్ విజయానంతరం భారత క్రికెట్ జట్టు మరో కీలక విదేశీ పర్యటనకు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని యువ జట్టు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటన కోసం బయల్దేరింది. ఈ పర్యటనలో భారత్ తొలుత ఐర్లాండ్‌తో డబ్లిన్‌లో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లు జరగనున్నాయి. ఇది టీ20 ప్రపంచకప్ తర్వాత భారత జట్టు ఆడుతున్న తొలి ద్వైపాక్షిక టీ20 సిరీస్ కావడం విశేషం. ఈ పర్యటనలో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ జట్టులోకి ఎంపికై ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తూ అత్యంత పిన్న వయస్కుడిగా



భారత సీనియర్ జట్టులో చోటు సంపాదించడం విశేషం. అలాగే ప్రిన్స్ యాదవ్ కూడా తొలిసారి టీ20 జట్టులోకి వచ్చాడు. వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రానున్నాడు. సిరాజ్ స్థానంలో ప్రసిధ్ కృష్ణను జట్టులోకి తీసుకోగా, హర్షిత్ రాణా మరియు రవి బిష్ణోయ్ కూడా తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నారు.టీ20 సిరీస్ జూలై 1 నుంచి 11 వరకు జరగనుండగా, వన్డే సిరీస్ జూలై 14 నుంచి 19 వరకు కొనసాగనుంది.

## ఆటగాళ్లకు నెల రోజుల విశ్రాంతి ఇవ్వండి:

# బీసీసీఐకి గావస్కర్ కీలక సూచన

**ముంబై, 23 జూన్ 2026**

భారత మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బీసీసీఐకి పలు కీలక సూచనలు చేశారు. వరుస అంతర్జాతీయ సిరీస్‌లతో బిజీగా మారిన భారత క్రికెటర్ల వర్క్‌లోడ్‌ను తగ్గించేందుకు ప్రతి ఏడాది కనీసం ఒక నెలపాటు పూర్తిస్థాయి విశ్రాంతి ఇవ్వాలని ఆయన అభిప్రాయ పడ్డారు. అఫ్గానిస్థాన్‌తో ఇటీవల ముగిసిన టెస్టు, వన్డే సిరీస్‌లలో భారత్ విజయాల నేపథ్యంలో గావస్కర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అవసరం లేకుండా తరచుగా జట్టులో మార్పులు చేయడం సరికాదని, గాయాలు లేని పరిస్థితుల్లో అత్యుత్తమ జట్టునే బరిలోకి దింపాలని ఆయన సూచించారు. భారత్



అనేక దేశాలకు క్రికెట్ అభివృద్ధి కోసం సహకారం అందిస్తున్న నేపథ్యంలో ఇది మంచి విషయమేనని గావస్కర్ పేర్కొన్నారు. అయితే ఆటగాళ్ల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. స్టార్ ప్లేయర్లకు విశ్రాంతి ఇవ్వాలనే పేరుతో బలమైన జట్టును దూరం పెట్టడం సరైన విధానం కాదని అన్నారు. అఫ్గాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మానవ్ సుతార్ వంటి యువ ఆటగాళ్లు అరంగేట్రం చేసిన విషయాన్ని ప్రస్తావించిన గావస్కర్, బుమ్రా వంటి కీలక బౌలర్లను విశ్రాంతి పేరుతో దూరం చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు.

## ఇంగ్లాండ్ సిరీస్‌కు కోహ్లీ ఎంపిక..

# ఫిట్‌నెస్‌పై బీసీసీఐ షరతు

**న్యూఢిల్లీ, 23 జూన్ 2026**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఇంగ్లాండ్ పర్యటనకు బీసీసీఐ ఎంపిక చేసింది. అయితే ఆయన ఎంపికను పూర్తిగా ఫిట్‌నెస్‌కు అనుసంధానిస్తూ బోర్డు కీలక షరతు విధించింది. ఐపీఎల్ 2026 ఫైనల్‌లో హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురైన కోహ్లీ ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఈ గాయం కారణంగా ఆయన అఫ్గానిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమయ్యారు. ఇంగ్లాండ్‌తో జూలై 14 నుంచి ప్రారంభమయ్యే వన్డే సిరీస్ నాటికి



కోహ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తారని సెలక్టర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరులో కోహ్లీ ఇటీవల ల్యాండ్ అయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన యూకే పర్యటనకు గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, 2027 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పాల్గొంటారా అనే అంశంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఈ విషయంపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పందిస్తూ, ఇది పూర్తిగా సెలక్షన్ కమిటీ, హెడ్ కోచ్, క్రికెట్ వ్యవహారాల కమిటీ మధ్య జరిగే నిరంతర వ్యూహాత్మక ప్రక్రియ అని తెలిపారు.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కి రిషబ్ పంత్ రీ-ఎంట్రీ

**న్యూఢిల్లీ, 23 జూన్ 2026**

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన ఆయన ఇప్పుడు తిరిగి ఢిల్లీ జట్టుతో ఆడనున్నారు.ఇదే క్రమంలో ఢిల్లీ జట్టులో ఉన్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్‌కి మారనున్నట్లు సమాచారం. పంత్‌ను లక్నో యాజమాన్యం గతంలో 27 కోట్ల రూపాయల భారీ ఒప్పందంతో కొనుగోలు చేసినప్పటికీ, ఇటీవల అతని ప్రదర్శన స్థిరంగా లేకపోవడంతో ఫ్రాంచైజీని విడిచేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. ఢిల్లీకి తిరిగి చేరేందుకు పంత్ 15 కోట్ల ఒప్పందానికి ఒప్పుకున్నట్లు సమాచారం. దీంతో ఆయనకు దాదాపు 12 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు



అంచనా.కుల్దీప్ యాదవ్ మాత్రం ప్రస్తుతం ఉన్న 12.50 కోట్ల ఒప్పం దంతోనే లక్నో జట్టుకు మార నున్నట్లు తెలుస్తోంది. 2016 నుంచి 2024 మధ్య ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 111 మ్యాచ్‌లు ఆడిన పంత్, 2021 నుంచి 2024 వరకు జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు.లక్నో జట్టులో మాత్రం ఆయన ఆశించిన స్థాయిలో రాణించ లేకపోయారు. 2025 సీజన్ లో 14 మ్యాచ్‌ల్లో 269 పరుగులు మాత్రమే చేయగా, 2026 సీజన్‌లో 312 పరుగులు సాధించినప్పటికీ జట్టు ప్రదర్శన బలహీనంగా కొనసాగింది. గత సీజన్‌లో లక్నో కేవలం 8 పాయింట్లతో లీగ్‌లో అట్టడుగున నిలిచింది.



# నితీశ్ రెడ్డికి గాయం

**న్యూఢిల్లీ, జూన్ 23**

టీమిండియాకు భారీ దెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఐర్లాండ్‌తో జరగాల్సిన టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా అతను ఈ సిరీస్‌ను మిస్ అవుతున్నాడు. ఇటీవల ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అతను గాయపడినట్లు సమాచారం.

హార్దిక్ పాండ్యా పాత్రను భర్తీ చేస్తాడని భావించిన నితీశ్ రెడ్డి అనూహ్యంగా జట్టుకు దూరమవడం టీమిండియాకు ఎదురుదెబ్బగా మారింది. అతని ఎడమ కాలి కండరంలో వాపు ఉన్నట్లు ఎంఆర్ఐ స్కానింగ్‌లో తేలిందని బీసీసీఐ అధికారి తెలిపారు. ప్రస్తుతం అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల అంచనా ప్రకారం కోలుకోవడానికి కనీసం నాలుగు వారాల సమయం పడే అవకాశం ఉంది. కొన్నిసార్లు ఈ గడువు మరింత పెరిగే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది. 23 ఏళ్ల నితీశ్ ఇప్పటివరకు పది టెస్టులు, ఆరు వన్డేలు, నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌లో రెండు వన్డేల్లో పాల్గొన్న అతను, గాయం కారణంగా తన బౌలింగ్ చేయలేని పరిస్థితికి చేరుకున్నాడు.




## సెప్టెంబర్ 25న 'ది పారడైజ్'

# విడుదలకు ప్లాన్?

**హైదరాబాద్, 23 జూన్ 2026**

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'ది పారడైజ్'పై ప్రేక్షకుల్లో అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ కలిసి పనిచేస్తుండటంతో సినిమా ప్రకటించినప్పటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది. సినిమా విడుదల తేదీపై గత కొంతకాలంగా పలు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తొలుత మార్చి 2026లో విడుదల చేయాలని భావించినట్లు ప్రచారం జరిగినప్పటికీ, షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా ఆగస్టుకు వాయిదా పడినట్లు సమాచారం వెలువడింది. ఆగస్టు విడుదలపై అధికారిక ప్రకటన రాకపోవడంతో, సినిమా డిసెంబర్‌కు వెళ్లే అవకాశమున్నట్లు కూడా చర్చ సాగింది. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం 'ది పారడైజ్'ను సెప్టెంబర్ 25, 2026న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తేదీపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తూ, పాన్ ఇండియా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని మేకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సినిమా బడ్జెట్ కూడా అంచనాలను మించి భారీ స్థాయికి చేరినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారని సమాచారం. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్ బాబు కీలక ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్‌తో పాటు బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' తర్వాత నాని--శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు భావిస్తున్నారు. 'ది పారడైజ్'ను కేవలం తెలుగు సినిమాగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



### శ్రుతి హాసన్
## సంచలన వెల్లడి
### సెలూన్‌కి దూరంగా స్వీయ జుట్టుసంరక్షణ

**హైదరాబాద్, జూన్ 23**

నటి శ్రుతి హాసన్ తన ప్రత్యేక జీవనశైలి, ఫ్యాషన్ ఎంపికలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తారు. తాజాగా ఆమె తన జుట్టు సంరక్షణకు సంబంధించిన విషయాన్ని అభిమానులతో పంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. గత ఐదేళ్లుగా తాను సెలూన్‌కు వెళ్లలేదని, తన జుట్టును తానే కత్తిరించుకుంటూ అవసరమైన ట్రీట్‌మెంట్ కూడా ఇంట్లోనే చేసుకుంటానని ఆమె వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన "ఆస్క్ మీ ఎనీథింగ్" సెషన్‌లో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రుతి ఈ విషయం తెలిపారు. "నేను చివరిసారిగా సుమారు 2017లో హెయిర్ కలర్ వేశాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి కలర్ ఉపయోగించలేదు. సెలూన్‌కు వెళ్లి దాదాపు ఐదేళ్లయింది. నా జుట్టును నేనే కట్ చేసుకుంటాను, ట్రీట్‌మెంట్ కూడా నేనే చేసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో సెలబ్రిటీలు సాధారణంగా హెయిర్ స్టైలిస్టులు, బ్యూటీషియన్లపై ఆధారపడుతుంటారు. అలాంటి నేపథ్యంలో శ్రుతి హాసన్ స్వీయ సంరక్షణ విధానం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. కొందరు ఆమె నిజాయతీని, సహజ జీవనశైలిని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇంత బిజీ కెరీర్‌లో ఇలా స్వయంగా ఎలా నిర్వహిస్తున్నారోనని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. శ్రుతి హాసన్ ఎప్పటినుంచో సహజత్వం, మానసిక ఆరోగ్యం, స్వీయ స్వీకరణపై దృష్టి పెడుతూ వస్తున్నారు. రసాయన ఆధారిత చికిత్సలు, అధిక స్టైలింగ్‌కు దూరంగా ఉండటం కూడా ఆమె జీవనశైలిలో భాగమని గతంలోనే పలుమార్లు తెలిపారు.

### విజయ్-త్రిషపై మళ్లీ
## ఊహాగానాలు

**చెన్నై, జూన్ 23**

కోలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన తెరజంటల్లో దళపతి విజయ్, త్రిష జోడీకి ప్రత్యేక స్థానం ఉంది. పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన ఈ ఇద్దరి మధ్య ఉన్న తెరపై కెమిస్ట్రీ ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంది. అయితే గత కొంతకాలంగా వీరి వ్యక్తిగత అనుబంధంపై కూడా సామాజిక మాధ్యమాల్లో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. తాజాగా విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష ఎలాంటి శుభాకాంక్షల సందేశం పెట్టకపోవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దీంతో వీరిద్దరి మధ్య ఏమైనా దూరం పెరిగిందా అనే అనుమానాలు అభిమాన వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా విజయ్, త్రిషలు పలు కార్యక్రమాల్లో కలిసి కనిపించడం, ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వడం, వ్యక్తిగత వేడుకల్లో హాజరవడం వంటి పరిణామాలు అభిమానుల్లో ఆసక్తి పెంచాయి. ఈ క్రమంలో వీరిద్దరి స్నేహం కేవలం సహనటుల సంబంధాన్ని మించి ఉండొచ్చని సామాజిక మాధ్యమాల్లో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అదే సమయంలో విజయ్ వ్యక్తిగత జీవితంపై కూడా పలు ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ అంశాలపై విజయ్ గానీ, త్రిష గానీ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. అధికారిక ప్రకటనలేమీ లేకపోయినా, వీరి గురించి వచ్చే ప్రతి చిన్న పరిణామం అభిమానుల్లో పెద్ద చర్చకు దారి తీస్తూనే ఉంది. ఈసారి విజయ్ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్య మాలు విజయ్‌కు సంబంధించిన పోస్టులు, చిత్రాలు, వీడియోలతో నిండిపోయాయి. ఇలాంటి సమయంలో ప్రతి ఏడాది విజయ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పే త్రిష ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అందరి దృష్టిని ఆకర్షించింది. త్రిష సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తరచూ తన చిత్రాల అప్‌డేట్లు, వ్యక్తిగత ఫొటోలు పంచుకుంటూ ఉంటారు. అలాంటి త్రిష విజయ్ పుట్టిన రోజు వంటి సందర్భంలో స్పందించకపోవడంతో అభిమానుల్లో పలు రకాల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారాల ప్రకారం విజయ్ ప్రస్తుతం తన కుటుంబ జీవితం, రాజకీయ బాధ్యతలపై మరింత దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు.







## 2027లో ప్రభాస్ హ్యాట్రిక్

**హైదరాబాద్, జూన్ 23**

భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర తారగా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'బాహుబలి' తర్వాత ఆయనకు దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ విపరీతమైన గుర్తింపు లభించింది. దీంతో ప్రభాస్ నటిస్తున్న ప్రతి కొత్త చిత్రంపైనా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' చిత్రం మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం వసూళ్ల పరంగా నిరాశపరిచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇక దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' చిత్రంపై కూడా మంచి ఆసక్తి నెలకొంది. చారిత్రక నేపథ్యంలో యాక్షన్ ప్రధానంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మొదట 2026 చివర్లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని, 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ చిత్రాలు విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రామ్ సినిమాలో నివేదా?

**హైదరాబాద్, జూన్ 23**

టాలీవుడ్‌లో తనదైన నటనతో పాటు గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నివేదా పేతురాజ్ మరో క్రేజీ అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. 'మెంటల్ మదిలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి, ఆ తర్వాత విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న రాబోయే కొత్త చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైనట్లు ఫిల్మ్ నగర్‌లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. నివేదా పేతురాజ్ ఇప్పటికే తెలుగులో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. 'చిత్రలహరి', 'బ్రోచేవారెవరురా', 'అల వైకుంఠపురములో' వంటి చిత్రాల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అలాగే 'బ్లడీ మేరీ' వంటి ఓటీటీ చిత్రం, 'విరాట పర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాల్లో కూడా విభిన్నమైన పాత్రల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల వచ్చిన 'సింగ్ గీతం' చిత్రంతో కూడా ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు రామ్ పోతినేని సరసన నటించే అవకాశం లభిస్తే ఇది ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా మారుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రామ్ పోతినేని ఎనర్జీకి తగ్గట్టుగా కథానాయిక పాత్రను కూడా దర్శకుడు బలంగా రూపకల్పన చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నివేదా పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడి యాలో కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### పాప్‌కార్న్ ధరలపై రామ్‌చరణ్
## కామెంట్స్ వైరల్

**న్యూఢిల్లీ, జూన్ 23**

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' చిత్రం విడుదలైన తర్వాత తొలిసారిగా ఆయన జాతీయ వేదికపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రిపబ్లిక్ టీవీ నిర్వహించిన 'సమ్మిట్ 2026' కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌చరణ్, భారతీయ సినిమా, కుటుంబంతో కలిసి థియేటర్‌లో సినిమా చూసే అనుభవం, ప్రేక్షకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా థియేటర్లలో పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్ ధరలు అధికంగా ఉండటం గురించి ఆయన బహిరంగంగా మాట్లాడటం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారి తీసింది. 'గ్రేట్ పవర్ ఇండియా: నేషన్ ఫస్ట్' అనే అంశంతో నిర్వహించిన ఈ సమ్మిట్‌లో రామ్‌చరణ్ మాట్లాడుతూ, భారతదేశంలో ఇప్పటికీ సినిమా అనేది అత్యంత చౌకైన వినోద సాధనాల్లో ఒకటేనని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి థియేటర్‌కు వెళ్లి సిని మా చూడటం ఒక ప్రత్యేకమైన అనుభూతి అని, అది కేవలం వినోదం మాత్రమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలపరిచే సందర్భమని చెప్పారు. అయితే ఈ అనుభవాన్ని ప్రేక్షకులకు పూర్తిగా ఆస్వాదించనీయకుండా చేస్తున్న ప్రధాన సమస్య థియేటర్లలో ఆహార పదార్థాల అధిక ధరలేనని ఆయన అభిప్రాయపడ్డారు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467